# మనం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

శుక్రవారం । 17 । ఏప్రిల్ । 2026 పేజీలు: 8






## రబీ వరి కొనుగోళ్లు తక్షణమే

# ప్రారంభించాలి

ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయండి

3

కలెక్టర్ ఆదర్శ్ సురభి

## పారిశుధ్యం, అభివృద్ధి పనులపై

# ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చెయ్యాలి...
- మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా మండల సభ....
- ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం కావడం సాధ్యం కాదని స్పష్టం....
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్....



2

నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమం భాగంగా మండల స్థాయి సభలను నిర్వహిస్తూ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతున్నామని ఆయన చెప్పారు.

## జాగ్రత్తలు తీసుకుందాం ప్రమాదాల బారినుంచి

# రక్షించుకుందాం



ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాల్సిందే

తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి పిలుపు

జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, జిల్లా ఎస్పీ జానకిలతో కలిసి హెల్మెట్ల పంపిణీ

హెల్మెట్లు ఇస్తామని పిలిచి ఇవ్వలేదంటున్న ద్విచక్ర వాహనదారులు

2

ద్విచక్ర వాహనదారులతోపాటు నాలుగు చక్రాలను నడిపించే ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను, పోలీసు శాఖ జారీ చేసే జాగ్రత్తలను పాటించి తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి సూచించారు. గురువారం ఈమేరకు మహబూబ్నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని పెదయ్యపల్లి చౌరస్తాలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి జిల్లా ఎస్పీ జానకి తదితరులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు.

# పారిశుధ్యం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి



**- ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్ధంగా అమలు చెయ్యాలి...**

**- మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా మండల సభ....**

**- ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం కావడం సాధ్యం కాదని స్పష్టం....**

**- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్....**

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 16 (మనం బ్యూరో): నాగర్కర్నూల్ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమం భాగంగా మండల స్థాయి సభలను నిర్వహిస్తూ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతున్నామని ఆయన చెప్పారు.



గురువారం వంగూరు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు ఏర్పాటు చేసిన మండల సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు, అవసరాల ఆధారంగానే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు రూపుదిద్దుకుంటాయని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ......, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరిట 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుధ్యం, మౌలిక వసతులు, గ్రామీణ అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ తెలిపారు. మండల సభలు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే వేదికలుగా మారుతున్నాయన్నారు. ఆయా శాఖల సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, రాయితీ గ్యాస్, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. అలాగే మహిళల సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యాపార అవకాశాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విద్యా రంగంలో కూడా ప్రభుత్వం కొత్త కార్యక్రమాలను ప్రవేశ పెడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే పథకాలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. పెండింగ్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరలో గృహ ప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామస్థులు తమ సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.



ఈ సమావేశంలో ప్రజలు అభివృద్ధి పనులకు సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రకళ, గ్రామ సర్పంచ్ యాదయ్య, ఎంపిడిఓ, తహసిల్దార్ , స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# జాగ్రత్తలు తీసుకుందాం ప్రమాదాల బారి నుండి రక్షించుకుందాం

**ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాల్సిందే**

**తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి పిలుపు**

**జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, జిల్లా ఎస్పీ జానకిలతో కలిసి హెల్మెట్ల పంపిణీ**

**హెల్మెట్లు ఇస్తామని పిలిచి ఇవ్వలేదంటున్న ద్విచక్ర వాహనదారులు**

బాలానగర్ : ఏప్రిల్ 16( మనం న్యూస్): ద్విచక్ర వాహనదారులతోపాటు నాలుగు చక్రాలను నడిపించే ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను, పోలీసు శాఖ జారీ చేసే జాగ్రత్తలను పాటించి తెలంగాణ రాష్ట్ర బీజేపీ శివధర్ రెడ్డి సూచించారు. గురువారం ఈమెరకు మహబూబ్నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని పెదయ్యపల్లి చౌరస్తాలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి జిల్లా ఎస్పీ జానకి తదితరులతో కలిసి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ఎవరు కూడా




రాంగ్ రూట్లో వెహికల్ ని తీసుకువెళ్లదని సూచించారు. వ్యతిరేక మార్గంలో ప్రయాణించి తన రూట్లో వచ్చే వ్యక్తి ఢీకొంటే రాంగ్ రూట్లో ప్రయాణించిన వ్యక్తిదే తప్పు అవుతుందని, ఆ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వాహనదారుడు మాత్రమే కాకుండా వెనకాల కూర్చున్న ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. హెల్మెట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

**హెల్మెట్లు ఇస్తామని పిలిచారు.. ఇవ్వలేదంటున్న ద్విచక్ర వాహనదారులు**

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డితో పాటు రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ జానకి తదితరులు విచ్చేస్తున్న నేపథ్యంలో పలువురు ద్విచక్ర వాహనదారులను వివిధ గ్రామాల నుంచి పిలిపించారని పలువురు పేర్కొన్నారు. తమకు హెల్మెట్లను అందజేస్తామని చెప్పి తీరా బైక్ లను తీసుకొని రోడ్డు మీదకు వచ్చాక తమకు హెల్మెట్లు అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిలిపించినందుకన్నా హెల్మెట్లు అందజేసిన ఉంటే చాలా బాగుండేదని వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# రబీ వరి కొనుగోళ్లు తక్షణమే ప్రారంభించాలి

**ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయండి**
**కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి, ఏప్రిల్ 16 (మనం న్యూస్): జిల్లాలో రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్తో కలిసి కలెక్టరేట్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

జిల్లాలో రబీ వరి పంటలు కోతల దశకు చేరుకున్నాయని, రైతులు కోత పూర్తిచేసిన వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం స్వీకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సీజన్లో సుమారు 3.70 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చే అవకాశముందని అంచనా వేశారు.

ముందుగా కోతకు వచ్చే మండలాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. కేంద్రాల్లో బరువు కొలిచే యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రైతులకు తాగునీరు, నీడ వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు





చేయాలని స్పష్టం చేశారు. కేంద్రాల నిర్వాహకులకు అవసరమైన శిక్షణ పూర్తి చేసి, ట్యాబ్ ఎంట్రీలను వేగంగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధాన్యం నిల్వ కోసం గోదాములను సిద్ధం చేయాలని మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు బ్యాంకు గ్యారంటీ సమర్పించిన వారికే ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో డీఆర్డీఓ ఉమాదేవి, డీసీఎస్ఓ కాశీ విశ్వనాథ్, డీసీఓ రాణి తదితర అధికారులు పాల్గొన్నారు.



## క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో బిజినపల్లి, తిమ్మాజిపేట సర్పంచులకు ఘన సన్మానం

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 16 (మనం బ్యూరో): బిజినపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎంపికైన ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులను క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువలతో గురువారం ఘనంగా సన్మానించినట్లు క్లబ్ జిల్లా అధ్యక్షుడు నాగం చంద్రమోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గాడి సురేందర్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్ మాట్లాడుతూ... గ్రామాలలో సర్పంచులు సహకరిస్తే 365 రోజుల పాటు 365 సేవ కార్యక్రమాలలో కోరిన ప్రతి గ్రామాలలో భాగస్వాములు అవుతామన్నారు. బిజినపల్లి, తిమ్మాజిపేట చెందిన 120 మంది సర్పంచ్ లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కతలప్ప, ఎమ్మార్వో మునిరొద్దీన్, ప్రత్యేక అధికారి రాజేశ్వరి, క్లబ్ సభ్యులు రమణకుమార్, సూర్య కళ, పోల శ్రీనివాసులు, కేవీ ప్రసాద్, నాగిరెడ్డి, శ్రీనివాసచారి, సత్యంలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంపై మండల సభ సమీక్ష

బాలానగర్ : ఏప్రిల్ 16( మనం న్యూస్ ): మండలంలోని పెద్దాయపల్లి శివారులో ఉన్న రైతు వేదికలో గురువారం ప్రజాపాలన ప్రగతి కార్యక్రమం 99 రోజుల ముగింపు సందర్భంగా మండల సభ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని, ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి పురోగతి, అమలు పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతు భరోసా, రైతు బీమా, సేంద్రీయ వ్యవసాయం, సన్న వడ్ల బోనస్ వంటి అంశాలపై చర్చించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయనున్నట్లు మండల విద్యాధికారి శంకర్ నాయక్ తెలిపారు.

మండలంలోని 37 గ్రామపంచాయతీలలో గృహ జ్యోతి పథకం కింద ఇప్పటివరకు రూ.3 కోట్లకు పైగా విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లించినట్లు విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ వెల్లడించారు. మండలానికి నాలుగు సబ్ స్టేషన్లు మంజూరు కాగా, అందులో రెండు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీఓ విజయ కుమారి, పశువైద్య అధికారి రఘురాం కుమార్, ఏపీఎం తిరుపతయ్య, వ్యవసాయ అధికారి సుజాత, శిశు సంక్షేమ శాఖ అధికారి రాజా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## అక్షర వనంలో అగ్రగామి.. ఎమ్మెల్యే అభినందనల కుసుమాంజలి!!

**ప్రతిభకు పట్టాభిషేకం--విజేతను అభినందించిన తెలంగాణ డిజిపి**

ఊరుకొండ ఏప్రిల్ 16 (మనం న్యూస్): స్థానిక మండల పరిధిలోని గురువారం ఉరుకొండ పేట గ్రామానికి చెందిన అబ్దుల్ సమీ షాహిన్ బేగంల ద్వితీయ తనయ షగుఫ్తనాజ్ ను కల్వకుర్తి లోని న్యూ ఎరా బాలికల జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తూ ఇంటర్ బోర్డు ఫలితాలలో తెలంగాణ ప్రథమ ర్యాంకు సాధించిన సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి జడ్చర్ల పట్టణ కేంద్రంలో ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వ్యాఖ్యానిస్తూ విద్యార్థుల కష్టానికి తగిన ఫలితం దక్కినప్పుడు ఆ విజయాన్ని గుర్తించి ప్రోత్సహించే నాయకులు ఉంటే వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందని ఒక సాధారణ మధ్యతరగతి పేద కుటుంబాల నుంచి వచ్చి పట్టుదలతో చదివి తెలంగాణ వ్యాప్తంగా మొదటి ర్యాంకు సాధించడం సామాన్య విషయం కాదు అని విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా ఉన్నత ఆశయాలతో సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులో ఉన్నత చదువుల కోసం తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.విద్యార్థుల వెనుక ఉండి ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఉత్తమ బోధన అందించిన గురువులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.ఒక విద్యార్థి విజయంలో గురువుల పాత్ర మరువలేనిదని క్రమశిక్షణతో కూడిన విద్య విజయానికి బాటలు వేస్తుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన రోడ్డు భద్రత



వారోత్సవాలకు ముఖ్య అతిథులుగా పాల్గొని సంభాషిస్తూ రాష్ట్ర పోలీస్ అగ్ర అధికారి చేతుల మీదుగా ఈ సన్మానం అందుకోవడం విద్యార్థులకు మర్చి పోలేనుభూతిని మిగిల్చిందని ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని మరింత రెట్టింపు చేయడమే కాకుండా తోటి విద్యార్థులకు కూడా ఒక గొప్ప ప్రేరణగా స్ఫూర్తిగా నిలుస్తుందని తమ కష్ట కాయానికి తగిన గుర్తింపు లభించిందని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు.ఒక రాష్ట్ర శాంతి భద్రతలను కాపాడే డిజిపి విద్యార్థుల విద్యా విజయాలను అభినందించడం ద్వారా విద్యకు శాఖకు పోలీసు శాఖ మధ్య ఒక సానుకూల వారధిని నిర్మించారు.440మార్కులకు 438మార్కులు సాధించిన షగుఫ్తనాజు ను అభినందించి ప్రతిభ ఎక్కడ ఉన్నా దానికి గౌరవం లభిస్తుందని ఈ సంఘటన మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని కొనియాడారు.ఈ సందర్భంలో మహబూబ్నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రసంగిస్తూ నేటి విద్యార్థులే రేపటి బావి భారత పౌరులు అనడానికి ఈ విద్యార్థిని స్ఫూర్తిదాయకమని కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అవరోధించాలని కఠోరమైన శ్రమ గురువుల ప్రేరణ అంకితభావం తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లనే ఇలాంటి విజయాలకు చేరువవుతారని విశ్వసించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్నగర్ జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీసు అధికారిని జానకి విద్యార్థిని తల్లిదండ్రులు పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.



## డి-8 మేజర్-1 కాల్వ లీకేజీతో 50 ఎకరాల సాగుభూమి దెబ్బతింది

రేవల్లి ఏప్రిల్ 16 మనం న్యూస్ : రేవల్లి మండలంలోని పాత తండా గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త తండాలో డి-8 మేజర్-1 కాల్వ లీకేజీతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. కాల్వ నుంచి నీరు పొలాల్లోకి చేరడంతో సుమారు 50 ఎకరాల సాగుభూమి జోకు పారి సాగుకు అనర్హంగా మారిందని రైతులు తెలిపారు. గురువారం సర్పంచ్ శ్రీను, వార్డ్ మెంబర్ పాండు ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఏఈని క్షేత్రస్థాయికి పిలిపించి సమస్యను వివరించారు. వర్షాకాలంలో రహదారులు కూడా దెబ్బతింటున్నాయని తెలిపారు. తక్షణమే శాశ్వత పరిష్కారం చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.






## ఎర్రగడ్డ బస్తీలో ఘనంగా హిందూ సమ్మేళన కార్యక్రమం

**– ప్రతి హిందు బంధువు ఐక్యతో మెలగాలి**

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 16 (మనం బ్యూరో): హిందూ సమాజం జాగృతం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆచార్య అభినవ శంకరానందస్వామి అన్నారు. ఆర్ ఎస్ఎస్ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ బస్తీలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ధర్మపరిరక్షణ కోసం హిందువుగా జీవించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి హిందువు తమ పిల్లలు, కుటుంబ సభ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. భారత దేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు తెలిసేలా ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కాగా, సమ్మేళనంలో చిన్నారుల సాంస్కృ తిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్ర మంలో ప్రధాన వక్త భాస్కరయోగి, ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ్ చాలక్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి పిడికిళ్ల జంగయ్య, పట్టణ కార్యవహ్ వేముల సురేశ్ పాల్గొన్నారు.



## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు ఘన సన్మానం

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 16 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు తాజా ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి కళాశాలకు గౌరవాన్ని తెచ్చారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ సుప్రజాత ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను అధ్యాపకుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..., విద్యార్థినులు భవిష్యత్తులో దృఢ సంకల్పంతో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాలని సూచించారు. అలాగే తమ తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో తక్కువ మార్కులు సాధించిన, ఫెయిల్ అయిన విద్యార్థులు ఏప్రిల్ 20, 2026 సాయంత్రం 5 గంటలలోపు కళాశాలలో పరీక్ష ఫీజు చెల్లించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# లచ్చనాయక్ తండా విద్యార్థిని 'హనిదీప' ప్రతిభ

**నవోదయ సీటు సాధనపై సర్వత్రా ప్రశంసలు.**



కొల్లాపూర్ ఏప్రిల్ 16 (మనం న్యూస్): కష్టపడి చదివితే విజయం వరిస్తుందని లచ్చనాయక్ తండాకు చెందిన విద్యార్థిని హనిదీప నిరూపించింది. కొల్లాపూర్ మండలం, లచ్చనాయక్ తండాకు చెందిన సీతారాం కుమార్తె హనిదీప, ఇటీవల వెలువడిన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి సీటు సాధించడంతో విద్యార్థినిని ఘనంగా సన్మానించిన ఎంఈఓ ఇమాన్యుయల్, ఈ సందర్భంగా హనిదీప సాధించిన ఈ గొప్ప విజయాన్ని పురస్కరించుకొని కొల్లాపూర్ మండల విద్యాధికారి (ఎం ఈ ఓ) ఇమాన్యుయల్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిరిజన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హనిదీప ను మరియు ఆమె తల్లిదండ్రులను ఎంఈఓ ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సరైన పట్టుదలతో ఉంటే నవోదయ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో సీట్లు సాధించవచ్చని హనీ దీప నిరూపించింది. గిరిజన బిడ్డలు చదువులో రాణించడం గర్వకారణం ఇమాన్యుయల్ ఎంఈఓ

**కార్యక్రమ విశేషాలు:**

గిరిజన ఉపాధ్యాయుల ప్రోత్సాహం: ఈ కార్యక్రమంలో గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు మరియు ఉపాధ్యాయులు పాల్గొని, తండా నుంచి ఒక విద్యార్థిని జాతీయ స్థాయి విద్యా సంస్థకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఆదర్శంగా హనిదీప మారుమూల తండా నుంచి వచ్చి, పరిమిత వనరులతో నవోదయ సీటు సాధించిన హనిదీపను ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని వారు కోరారు.

**తల్లిదండ్రుల ఆనందం:** తన కుమార్తె విజయం వెనుక ఉపాధ్యాయుల కృషి, ఎంఈఓ ప్రోత్సాహం ఉందని హనిదీప తండ్రి సీతారాం కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గిరిజన సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొని హనీ దీపకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. హనీ దీపకు మరియు వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు

ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు శంకర్

రమేష్, చందు, బాలాజీ, మూర్తి, దశరథం, రాజేష్, హోమ్ గార్డ్ గోపాల్, హుస్సేన్ సీతారామ్ పాల్గొన్నారు.

# సర్కారు ఆదేశం - ప్రజల వికాసం

**జిల్లా ప్రత్యేక అధికారి శ్రీనివాస్.**
**పాలనలో నవ శకం 99 రోజుల ప్రగతి యజ్ఞం**
**ఊరుకొండ మండల సభలో ప్రగతి సంబరం**
**మండల అభివృద్ధి అధికారి కొప్పుల సత్యపాల్ రెడ్డి**

ఊరుకొండ ఏప్రిల్ 16 (మనం న్యూస్): ఊరుకొండ మండల కేంద్రంలోని గురువారం రైతు వేదిక భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలనా--ప్రగతి ప్రణాళిక'జిల్లా ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామ మండల అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి 99 రోజుల కార్యచరణ లో జైత్రయాత్రగా సాగుతున్న తరుణంలో స్థానిక ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించ మండల స్థాయి సమావేశాలకు కీలక పాత్ర పోషించాయి.ఈ నేపథ్యంలో పలు విభాగాల అధికారులు పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారం దిశగా గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు నెలకొన్న వివిధ సమస్యలను ప్రధానంగా నీరు,రోడ్లు,విద్యుత్,సర్పంచులు వార్డ్ మెంబర్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.సంక్షేమ పథకాలలో ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు,సన్న బియ్యం,ఉచిత రేషన్ కార్డులు,విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడం, వంటివి ఎంతవరకు పురోగతిని సాధించినవని కూలంకుశంగా అన్వేషించి అర్హులకు అందేలా చర్చించడం జరిగింది.పంచాయతీ రాజ్,రెవెన్యూ,విద్యా, ఆరోగ్యశాఖ,అధికారులు అందరూ సభలో పాల్గొని వివిధ అంశాలపై పురోగతిని సభ్యుల మధ్య చర్చించి వినిపించడం జరిగింది.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ వేయడం గ్రామాభివృద్ధిని వేగవంతం చేయడం ప్రజాప్రతినిధులు అధికారులు జవాబుదారీగా మార్చడం మండలంలో జరిగిన ఈ సభలో ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రత్యేక దృష్టి సారించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలనలో పారదర్శకతను పెంచేందుకు ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక పేరుతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరించేందుకు ఊరుకొండ మండల కేంద్రంలో మండల సభ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకోవడం జరిగిందని జిల్లా ప్రత్యేక అధికార శ్రీనివాసులు తెలిపారు.మన పల్లెలు బాగుంటేనే మన బతుకులు బాగుంటాయి అన్నట్లుగా ఊరుకొండ మండల సభ ప్రజల్లో కొత్త నమ్మకాన్ని నింపింది .99 రోజుల ప్రణాళికతో మన మండలంలోని అభివృద్ధి పరుగులు పెడుతుందని ప్రతి పేదవానికి సంక్షేమ పథకాల అభివృద్ధిని ఆశిద్దాం.ఊరుకొండ ప్రగతికి మనమంతా తోడై నిలబడదామని అధికారులు స్పందించడం జరిగింది.వేసవి కాలాన్ని అంచనా వేసుకుని త్రాగునీటి ఎద్దడి నివారించేందుకు మిషన్ భగీరథ అధికారులు యుద్ధ ప్రాతిపదికన సమస్యల్ని



పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని పలువురు సర్పంచులు ఆకాంక్షించారు. గ్రామాలలో వృద్ధులకు పెన్షన్ టైం కు రావాలన్నా,కరెంటు సౌకర్యం సంతృప్తిగా అందాలన్నా,ఈ మండల సభలు అత్యంత కీలకమని ఊర్లో డ్రైనేజీలు సాపుగా ఉండాలే,ప్రతి ఇంటికి నల్ల నీళ్లు రావాలి.అధికారులు నాయకులు మనతోనే ఉన్నప్పుడు 'మనం'మన సమస్యలను మొహమాటం లేకుండా చెప్పాలి అని స్థానిక మండల అభివృద్ధి అధికారి కొప్పుల సత్యపాల్ రెడ్డి ప్రజలకు దిశ నిర్దేశం చేశారు. వచ్చిన సర్కారు మనది చేసే పని మన కోసం అనే నమ్మకం ప్రజల్లో కనిపించాలని పలువురు సర్పంచులు సంభాషించడం జరిగింది.నేడు ప్రారంభించబోయే కొత్త పథకాలు అన్నింటిలో విద్యార్థులకు అల్పాహార పథకం,ఇంటర్మీడియట్ వరకు రాగి జావా,వేడిపాల అందించే కార్యక్రమం, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం, ఇంటర్మీడియట్ స్థాయి దివ్యంగా విద్యార్థులకు మోటర్ ఉచిత వాహనాలు అందించడం,పంటల ఆధునీకరణ,సహజ సేంద్రియ ఎరువులను ప్రోత్సహించడం, ప్రభుత్వం సంక్షేమ పథకంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం,రైతు భరోసా,ఇందిరమ్మ ఇండ్లు,మహాలక్ష్మి రాయితీ గ్యాస్ సిలిండర్,గృహ జ్యోతి,వారికి బోనస్, చేయిత పెన్షన్స్,కళ్యాణలక్ష్మి,షాది ముబారక్,స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు,వడ్డీ లేని రుణాలు,ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం, సమావేశంలో గుర్తించినటువంటి తీర్మానాలన్నీ సజావుగా ప్రజల కందాలని సమీక్షించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,మండల స్థాయిలో ఉన్న అన్ని విభాగాల అధికారులు, గ్రామస్థాయి అధికారులు,క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొనడం జరిగింది..





# ఉపాధి హామీ పథకం విజయానికి సర్పంచులు-మహిళా సంఘాలు కీలకం

**- మహిళల రుణాలపై రూ.28 కోట్ల వడ్డీ**
**జమ: డీఆర్డీఓ పీడీ చిన్న ఓబులేసు**



ఉప్పునుంతల, ఏప్రిల్ 16 (మనం న్యూస్) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రత్యేక సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈసమావేశానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ చిన్న ఓబులేసు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పీడీ చిన్న ఓబులేసు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి, ప్రజలకు 100 రోజుల ఉపాధి కల్పించడం సర్పంచుల బాధ్యత అని తెలిపారు. పనుల అమలులో పారదర్శకత పాటించడం, సమయానికి కూలీలకు వేతనాలు చెల్లించడం వంటి అంశాల్లో నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు.అదేవిధంగా మహిళా సంఘాల పాత్రపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, మహిళలు ఉపాధి హామీ పనుల్లో చురుకుగా పాల్గొని తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. మహిళా సంఘాలు గ్రామస్థాయిలో అవగాహన కల్పించి, పనుల అమలులో పర్యవేక్షణ చేయడం ద్వారా అవినీతిని అరికట్టవచ్చని తెలిపారు. సంఘాల ద్వారా పొదుపు అలవాట్లు పెంపొందించి ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని పేర్కొన్నారు.ఇక జిల్లాలో మహిళలు బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలపై రూ.28 కోట్ల వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరా కాంతి పథకం, వడ్డీ లేని రుణాలు, చేయూత, కళ్యాణ లక్ష్మి, ఇంద్ర మహిళా శక్తి వంటి పథకాలు మహిళల అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు.

ముఖ్యంగా వృద్ధులకు పింఛన్లు, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత సన్న బియ్యం వంటి సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో అందేలా సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఇంకా లబ్ధి పొందని మహిళలను గుర్తించి వారికి ప్రయోజనాలు అందించాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా అమలు చేసి గ్రామాభివృద్ధికి దోహదపడాలని పీడీ సూచించారు.ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తే పథకాల లక్ష్యాలు సాధ్యమవుతాయని తెలిపారు.ఇక సమావేశంలో వివిధ ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహించగా, ఆరోగ్య అంశాలపై కూడా అవగాహన కల్పించారు. కుక్క కాటు వంటి ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని వైద్య అధికారిణి డాక్టర్ స్వప్న సూచించారు.

**ఈ సమావేశంలో పాల్గొన్నవారు:**

ఎంపీడీవో రేవత్ రెడ్డి, తహసీల్దార్ అద్దంకి సునీత, ఉప తహసీల్దార్ రమేష్ నాయక్, మండల పంచాయతీ అధికారి అల్లాజీ, మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్, సీహెచ్సీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, వైద్య అధికారిణి డాక్టర్ స్వప్న, ఎస్త్రు వెంకట్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్, పశువైద్య అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు బిపాసా, పావని, ఏఈలు కొండల్, సాయికృష్ణ, మహేష్, వెంకటేష్, అంజనమ్మ, ఐకేపీ ఏపీఎం బాలచందర్, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.

## ఉప్పునుంతలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**సర్పంచ్ శ్రీనివాసులు వినతి**



ఉప్పునుంతల, ఏప్రిల్ 16 (మనం న్యూస్): మండల కేంద్రమైన ఉప్పునుంతలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలని గ్రామ సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు ప్రభుత్వాని కోరారు. మండలంలో పెద్ద ఎత్తున మొక్కజొన్న పంట సాగు చేస్తున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు.ఉప్పునుంతల మండలం నియోజకవర్గంలోనే అత్యధికంగా మొక్కజొన్న పంట పండించే ప్రాంతంగా గుర్తింపు పొందినప్పటికీ, సరైన సమయంలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడం రైతులకు భారంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు నుంచి ఐదు సంవత్సరాలుగా వరుసగా పంటలు సాగు చేస్తున్న రైతులు అప్పుల బారిన పడి ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. ఈ ప్రాంత రైతుల కోరిక మేరకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం మార్కెట్లో సరైన ధరలు లేకపోవడం, మధ్యవర్తుల ఆధీనంలో రైతులు నష్టపోవడం వంటి సమస్యలు ఎక్కువవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం ద్వారా రైతులకు కనీస మద్దతు ధర లభించి, ఆర్థికంగా కొంత ఊరటనిచ్చే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం దృష్ట్యా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు కోరారు.

## అనుమతులు లేకుండా ఇసుక రవాణా.. ట్రాక్టర్ స్వాధీనం

**అక్రమ ఇసుక రవాణా పట్టివేత**



రేవల్లి ఏప్రిల్ 16 మనం న్యూస్ : నాగర్కర్నూల్ జిల్లాకు చెందిన సతీష్ గౌడ్కు చెందిన ట్రాక్టర్ (ఖీఖీ06ఆ0268)లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా రేవల్లి పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. కొంకలపల్లి శివారు ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఘటనపై ఎస్ఐ రజిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

**విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 16 (మనం న్యూస్): విద్యార్థుల సంక్షేమం, విద్యాసంస్థల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ గురువారం కల్వకుర్తి పట్టణంలోని జేపీ నగర్లో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, ఆహార నాణ్యత తదితర అంశాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు.పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ముఖ్యంగా పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్వహణ, హాస్టల్ వసతులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.తనిఖీ సందర్భంగా పాఠశాలలో నిల్వ ఉంచిన బియ్యం, గుడ్లు, కూరగాయలు వంటి ఆహార సరుకులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు. తరగతి గదులు, పరిశుభ్రత పరిస్థితులు, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.అదేవిధంగా విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, బోధన విధానంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఉపాధ్యాయులతో సమావేశమై బోధన నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాలలో విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.తనిఖీ అనంతరం కలెక్టర్ భోజనశాలకు వెళ్లి విద్యార్థులతో కలిసి కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, రుచి, పరిమాణం వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు. భోజనం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ఇదే నాణ్యతను కొనసాగించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్ వారి



సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుపై దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.పాఠశాలల నిర్వహణలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్న కలెక్టర్, విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు తగిన విధంగా అన్ని సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈ తనిఖీలో కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

# జనాభా ప్రాతిపదికన అభివృద్ధి పనుల కేటాయింపు కావాలి: సర్పంచుల డిమాండ్

**కొందరు అధికారుల తీరుపై నిరసన**
**- చేపట్టిన పనులకు రికార్డు చేయాలని వినతి**
**సాఫీగా సాగిన మండల ప్రత్యేక సమావేశం**



ఉప్పునుంతల, ఏప్రిల్ 16 (మనం న్యూస్): మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సర్పంచులు పలు కీలక అంశాలను లేవనెత్తుతూ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామాల అభివృద్ధి పనులను జనాభా ప్రాతిపదికన కేటాయించాలని బలంగా డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అధికారులు సహకరించడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు ప్రక్రియలో సర్పంచుల ప్రమేయం లేకుండానే పనులు జరుగుతున్నాయని దాసర్లపల్లి ఉపసర్పంచ్ శంకర్, పెనిమెళ్ల సర్పంచ్ మేడసాని శ్రీలత విజేందర్ రెడ్డి హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లును ప్రశ్నించారు.

ఈ సందర్భంగా స్పందించిన డీఆర్డీఓ పీడీ చిన్న ఓబులేసు, ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో సర్పంచుల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీలో సర్పంచులు చైర్పర్సన్లుగా ఉంటారని హామీ ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు.

సమావేశంలో సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న ప్రాథమిక సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా లోపాలు, తాగునీటి కొరత వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గత రెండేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాభివృద్ధి నిలిచిపోయిందని, ఇప్పుడు తాము పదవిలోకి వచ్చిన తర్వాత కేవలం వంద రోజుల్లోనే జేసీబీ యంత్రాలతో మురికికంపలు తొలగించడం, చెట్ల తొలగింపు వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టామని ఉప్పునుంతల సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు తెలిపారు.అయితే ఈ పనులకు అధికారుల నుంచి సరైన గుర్తింపు లేకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ, చేపట్టిన పనులను అధికారికంగా రికార్డు చేసి సర్పంచులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జనాభా ఆధారంగా అభివృద్ధి పనుల కేటాయింపు జరగడం లేదని, 500 మంది జనాభా ఉన్న గ్రామాలకు కూడా 5 వేల జనాభా ఉన్న గ్రామాల మాదిరిగానే పనులు కేటాయించడం అన్యాయమని తీవ్రంగా విమర్శించారు.

గ్రామాల్లో సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు పనులు చేపడితే సహించబోమని సర్పంచులు సమావేశంలో హెచ్చరించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం తగదని స్పష్టం చేశారు.ఇక పెనిమెళ్ల గ్రామ సర్పంచ్ మేడసాని శ్రీలత విజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే సమక్షంలో తమ గ్రామానికి 50 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెనిమెళ్ల మీదుగా హైదరాబాద్కు అచ్చంపేట ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పి నెలలు గడిచినా అమలు చేయలేదని, వెంటనే బస్సు సౌకర్యం ప్రారంభించాలని కోరారు.

సమావేశం అనంతరం సర్పంచులు మరియు అధికారుల మధ్య పరిచయ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల వారీగా సమస్యలను వినేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ రేవత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచులు తమ సమస్యలను పూర్తిగా వివరించే అవకాశం కల్పించాలని కోరగా, త్వరలోనే మరోసారి సమావేశం ఏర్పాటు చేసి ప్రతి గ్రామ సమస్యను సమగ్రంగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.మొత్తంగా ఈ సమావేశం సాఫీగా సాగినప్పటికీ, సర్పంచుల ఆవేదన, డిమాండ్లు స్పష్టంగా వెలిబుచ్చబడటం గమనార్హం.

# వంగూరులో తెలంగాణ మోడల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన

**- ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు ఒకే చోట విద్యబ్యాసం....**
**- నాణ్యత, గడువు పాటిస్తూ మోడల్ స్కూల్ నిర్మాణం పూర్తి చేయాలి....**
**- నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...**



ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 16 (మనం బ్యూరో):

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ (మోడల్) స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ స్థలాన్ని సందర్శించి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను ఒకే చోట అందించే విధంగా ఆధునిక సదుపాయాలతో తెలంగాణ మోడల్ స్కూల్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు సమగ్ర విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డైనింగ్ హాల్, కిచెన్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, విశాలమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, బాత్రూములు, ఆట స్థలం వంటి అన్ని ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. పాఠశాల భవనం నిర్మాణం వేగవంతంగా కొనసాగుతున్నప్పటికీ, పనుల్లో నాణ్యతకు ఎలాంటి లోపం రాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పాఠశాల భవనం బలంగా, సురక్షితంగా ఉండేలా నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అలాగే తరగతి గదులు, ప్రయోగశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు సమగ్రంగా ఏర్పాటు చేయాలన్నారు. పనులు నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ఎక్కడైనా ఆలస్యం గమనించినట్లయితే తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ఇక పాఠశాల నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం లభిస్తుందన్నారు. ప్రభుత్వ విద్యా ప్రమాణాలు మరింత పెరుగుతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.చ





# లాటరీతో మార్కెట్ షాపుల కేటాయింపు

**వనపర్తి ఇంటిగ్రేటెడ్ మార్కెట్కు దరఖాస్తుల ఆహ్వానం**
**18లోపు అప్లై చేయాలి - 21న లాటరీ నిర్వహణ**



వనపర్తి, ఏప్రిల్ 16 మనం న్యూస్ : వనపర్తి పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్లోని షాపులు, సూపర్ మార్కెట్, బ్యాంక్, బ్యాంక్వెట్ హాల్లను లాటరీ విధానంలో కేటాయించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఈ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గ్రౌండ్ ఫ్లోర్లో 32 షాపులు అందుబాటులో ఉండగా, ఫస్ట్ ఫ్లోర్లో బ్యాంక్వెట్ హాల్, అదనంగా బ్యాంక్, సూపర్ మార్కెట్ స్థలాలు కూడా లాటరీ ద్వారా కేటాయించబడనున్నాయి. దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 18 సాయంత్రం 5 గంటల వరకు గడువు నిర్ణయించారు. దరఖాస్తు ఫారం ఫీజు రూ.2,500గా నిర్ణయించారు. దరఖాస్తు ఫారంతో పాటు నిర్దేశిత డిమాండ్ డ్రాఫ్ట్ సమర్పించాల్సి ఉంటుంది. షాపులకు ఈఎండీ రూ.15,000, బ్యాంక్ సూపర్ మార్కెట్కు రూ.25,000, బ్యాంక్వెట్ హాల్కు రూ.50,000గా నిర్ణయించారు.

లాటరీ కార్యక్రమం ఏప్రిల్ 21 ఉదయం 11 గంటలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. మొత్తం 32 షాపులలో జనరల్ కేటగిరికి 16, బీసీకి 8, ఎస్సీకి 5, ఎస్టీకి 2, పీహెచ్సీకి 1 షాపు కేటాయించనున్నారు. డిమాండ్ డ్రాఫ్ట్లు సెక్రటరీ, ఏఎంసీ, వనపర్తి టౌన్ పేరుతో తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, లేదా 7330733292, 7893633678 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు

- రోడ్డు భద్రతకు పోలీసులు చర్యలు
- తనిఖీల సమయంలో సంబంధిత పత్రాలు తప్పనిసరి
- రోడ్డు భద్రత నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు



అచ్చంపేట ఏప్రిల్ 16 (మనం న్యూస్): రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా అచ్చంపేట సబ్-డివిజన్ పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం అచ్చంపేట పోలీస్ స్టేషన్లో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అచ్చంపేట సీఐ నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాగర్కర్నూల్కు చెందిన కూచికుల్ల రామచంద్రారెడ్డి ఐ హాస్పిటల్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వైద్య బృందం కంటి పరీక్షలు చేపట్టింది. స్కూల్ బస్సులు, ఆటోలు, క్యాబ్లు, లారీలు తదితర వాహనాల డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఇట్టి పరీక్షలలో అవసరమైన వారికి ఉచిత కంటి పొర ఆపరేషన్ లతో పాటు ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ డ్రైవర్లకు స్పష్టమైన కంటి చూపు ఉండటం రహదారి భద్రతకు కీలకమని తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు.

మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అదేవిధంగా ఆటో, క్యాబ్, స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే నాన్బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేయరాదని, వాహనాలకు నెంబర్ ప్లేట్లు స్పష్టంగా ఉండాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ బుక్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని తెలిపారు. స్పీడ్ బ్రేకర్లు స్పష్టంగా కనిపించేలా ఆర్టీఏ, వాహన తనిఖీ అధికారులతో చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.




ఉచిత కంటి పరీక్షలు నిర్వహించిన వైద్య బృందానికి పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం 150 మంది డ్రైవర్లు ఈ క్యాంపులో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోగా సైట్ ఉన్నవారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ జ్యోతి, సూపర్వైజర్ వెంకటయ్యతో పాటు ఎస్సైలు సద్దాం హుస్సేన్, రాజేందర్, అంజయ్య, హనుమంత్ రెడ్డి, శ్రీను, జయన్న తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ తప్పనిసరి ఇవ్వాలి

- మన్ననూరు, బ్రహ్మగిరికి చెందిన రిపోర్టర్లకు అప్లికేషన్స్ ఇవ్వాలి....
- స్పందించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి....




ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 16 (మనం బ్యూరో): నూతనంగా అక్రిడేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు తప్పనిసరిగా అక్రిడేషన్ అందేలా చర్యలు చేపడతామని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాదులో జరిగిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. విజయ్ కుమార్, సురేష్ కుమార్ హాజరై నాగర్కర్నూల్ జిల్లాకు సంబంధించిన రెండు ప్రధాన సమస్యలను రాష్ట్ర నాయకత్వ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీకి వినతిపత్రాలు అందజేయడంతో పాటు సభా వేదికపై నుంచే సమస్యలను వివరించారు. మొదటి సమస్యగా కల్వకుర్తి ప్రాంతానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అక్రిడిటేషన్ కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే సమయంలో రంగారెడ్డి జిల్లా చూపిస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన నాయకులు ఇది టెక్నికల్ సమస్య అన్నారు. ఈ సమస్యలు రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నల్లమల్ల ప్రాంతంలోని మన్ననూరు, బ్రహ్మగిరి కేంద్రాల్లో మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి సంబంధించి కమిషనర్తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ వేదికపై నుంచి స్పష్టమైన హామీ ఇచ్చారు.ఈ నేపథ్యంలో మీడియా మిత్రులు ఎవరూ ఆందోళన చెందవద్దని జిల్లా అధ్యక్షుడు పి. విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి ఆర్. సురేష్ కుమార్ తెలిపారు.






# మానవత్వానికి నిదర్శనంగా ఆర్థిక సాయం

- అనారోగ్యంతో మృతిచెందిన మహిళ కుటుంబానికి రూ.5 వేల సహాయం

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 16 (మనం న్యూస్): కల్వకుర్తి మండలంలోని రఘుపతిపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామగిరి గ్రామానికి చెందిన మధ్యల బండ లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న రఘుపతిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీపురం హరీష్ రెడ్డి మానవత్వ దృక్పథంతో స్పందించారు.శ్రీపురం జంగారెడ్డి, శ్రీపురం విజయమ్మల జ్ఞాపకార్థంగా మృతురాలి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సహాయాన్ని రఘుపతిపేట గ్రామ సర్పంచ్ గుండాల గణేష్, రామగిరి దేవాలయ కమిటీ చైర్మన్ ఆకుతోట రవికుమార్, వెంకటయ్య వార్డు సభ్యుడు మద్దెల బండ ప్రభాకర్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందించారు.కష్టకాలంలో ఆ కుటుంబానికి అండగా నిలిచిన శ్రీపురం హరీష్ రెడ్డి మానవతా దృక్పథాన్ని గ్రామ ప్రజలు అభినందించారు.



# కొత్త బోరు మోటారు ప్రారంభం

సర్పంచ్- మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్.

వెల్దండ ఏప్రిల్ 16 (మనం న్యూస్) మండల కేంద్రంలో వేసవి కాలం నీటి ఎద్దటీని దృష్టిలో ఉంచుకొని కొత్త బోరు మోటార్ ఏర్పాటు చేసి బిగించి గురువారం గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ప్రారంభించారు. ముందుగానే ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ పరిస్థితులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న ఉప సర్పంచ్ బస్నమోని శ్రీనివాస్,5వ వార్డు సభ్యులు రేవల్లి మానస రాజు,గుద్దటీ కిష్టల్ , బొక్కల శ్రీనివాస్, అన్నెపు కృష్ణ, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన సేవల ముసుగులో ఆర్డినరీ బస్సులో ఎక్స్ప్రెస్ ఛార్జి వసూళ్లు

- అచ్చంపేట ఆర్టీసీ తీరుపై ప్రయాణికుల ఆగ్రహం
- ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న ఆర్టీసీ

అచ్చంపేట ఏప్రిల్ 16 మనం న్యూస్): ప్రజల సౌకర్యార్థం.. ప్రజల సేవే మా లక్ష్యం అనే నినాదంతో నడిచే ఆర్టీసీ, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట డిపో అధికారుల తీరుపై ప్రయాణికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. అచ్చంపేట నుండి హైదరాబాద్కు, అచ్చంపేట నుండి మద్దిమడుగు కు నడిచే ఎక్స్ప్రెస్ సర్వీసుల పేరుతో అధికారులు జిమ్మిక్కులు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేని, పాతబడిన ఆర్డినరీ బస్సులకు ఎక్స్ప్రెస్ బోర్డులు తగిలించి నడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. బస్సు కండిషన్ ఏమాత్రం బాగోలేకపోయినా, ప్రయాణికుల నుండి మాత్రం ఎక్స్ప్రెస్ ఛార్జీలను వసూలు చేయడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీట్లు సరిగ్గా లేవు, ప్రయాణం సుఖంగా లేదు, కానీ టికెట్ ధర మాత్రం ఎక్స్ప్రెస్ పేరుతో అధికంగా తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. అధికారుల ధ్యాస కేవలం ఆదాయంపైనే ఉంది తప్ప, ప్రయాణికుల ఇబ్బందుల గురించి పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఆర్డినరీ బస్సులను తక్షణమే తొలగించి, ఎక్స్ప్రెస్ ఛార్జీలకు తగ్గట్టుగా కండిషన్లో ఉన్న ఎక్స్ప్రెస్ బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆర్డినరీ ఛార్జీలనే వసూలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అచ్చంపేట డిపోలో జరుగుతున్న ఈ ఛార్జీల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# ప్రభుత్వ పథకాలను గ్రామాలలో అమలు చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

**- కల్వకుర్తి ఎంపీడీవో - ఎన్.వెంకటరాములు**
**- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సభ**
**- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారుల సమగ్ర వివరణ**




కల్వకుర్తి రూరల్ , ఏప్రిల్ 16 (మనం న్యూస్): ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం కల్వకుర్తి మండల స్థాయి సభ నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి జనార్దన్ రెడ్డి ఆర్డీఓ కల్వకుర్తి అధ్యక్షత వహించగా ఎన్. వెంకట్రాములు డిపై సీఈఓ ఎంపీడీఓ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సమావేశానికి తహసీల్దార్ ఇబ్రహీం, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు హాజరయ్యారు.



సభలో భాగంగా మండల స్థాయి అధికారులు తమ తమ శాఖల నివేదికలను సమర్పించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో పాటు భవిష్యత్తులో అమలు చేయనున్న కొత్త పథకాల విధి విధానాలను సభలో చదివి వినిపించారు. అలాగే సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ఇచ్చిన సూచనలు, అభిప్రాయాలను సమావేశ మినిట్స్‌లో నమోదు చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో స్థానిక సంస్థల ప్రతినిధుల పాత్ర ఎంతో ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలైన ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ, సన్న బియ్యం పంపిణీ, విద్యార్థులకు మెస్ ఛార్జీల పెంపు, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, సన్నరకం బోనస్, చేయూత పెన్షన్లు, ఎన్ఎఫ్బీఎస్, కల్యాణ లక్ష్మి, ఇందిర మహిళా శక్తి, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు, విద్యార్థులకు బ్రేక్ఫాస్ట్ పథకం తదితర సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా వివరించారు.ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సమావేశంలో సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎల్పీఓ, ఎంఈఓ, ఏఓ, ఎంపీఓ, సూపరింటెండెంట్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.





## డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

**-యువతలో సానుకూల మార్పు తీసుకురావడంలో గ్రామస్థాయి నాయకత్వం కీలకం.**
**-రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి.**

వనపర్తి ఏప్రిల్ 16 (మనం ప్రతినిధి) డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం గోపాల్పేట మండలంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా ఆయనతోపాటు కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, డిటిఓ మానస లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని సర్పంచులు ఉపసర్పంచులు అంగన్వాడి టీచర్లు ఆశా కార్యకర్తలు గ్రామ కార్యదర్శులు ప్రజా ప్రతినిధులు మహిళా సంఘాల నేతలతో పాటు వివిధ వర్గాల ప్రజలకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా రవాణా శాఖ మరియు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆటో ట్రాక్టర్ ఇతర వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి ప్రమాదాలకు దారి తీసే దృష్టి లోపాలను గుర్తించారు. ఆ తర్వాత రవాణా శాఖ సహకారంతో డ్రైవర్లకు హెల్మెట్లను పంపిణీ చేశారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించాలంటే ప్రజల్లో అవగాహన పెరగాలని ట్రాఫిక్ నియమాలను పాటించడం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో డి వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి, సిఐ సుగంధరత్నం, తహసిల్దార్ తిలక్ రెడ్డి, ఎంపీఓ భవాని, ఎస్ఐ జగన్, సర్పంచ్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమావేశం

వెల్దండ ఏప్రిల్ 16 (మనం న్యూస్ )మండల కేంద్రంలో గురువారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మండల స్థాయి సమావేశమును వెల్దండ గ్రామ రైతు వేదిక యందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి, రాబోయే రోజుల్లో అమలు చేయబోయే క్రొత్త పథకాల గురించి సభయందు చదివి వినిపించడం జరిగింది. హాజరైన అధికారులు, సర్పంచులు, వార్డుసభ్యుల హాజరు నమోదు చేసుకోవడం జరిగింది. ఇట్టి సమావేశమునకు మండల ప్రత్యేక అధికారి విజయశ్రీ, తాసిల్దార్ కార్తీక్ కుమార్, ఎంపిడిఓ కృష్ణయ్య, అందరు సర్పంచులు, ఉపసర్పంచ్ లు, వార్డు సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మరియు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## జాగృతి కళాశాల విద్యార్థులకు అభినందనలు వెల్లువ

**-రాష్ట్రస్థాయి ర్యాంకర్లను అభినందించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి.**
**-చిన్నారెడ్డికి శాలువా కప్పి సన్మానించిన ప్రిన్సిపాల్ వినోద్.**




వనపర్తి ఏప్రిల్ 16 (మనం ప్రతినిధి) వనపర్తిలో ర్యాంకుల పంట పండిస్తున్న జాగృతి జూనియర్ కళాశాల విద్యార్థులకు పలువురి నుంచి అభినందనలు వెల్లువ కొనసాగుతోంది. రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు, ఉమ్మడి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిన ఉజ్మా హజారా, అనుష్ట అనే విద్యార్థినిలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గురువారం కళాశాలకు చేరుకొని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. కార్పొరేట్ స్థాయిలో జాగృతి కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం వనపర్తికే గర్వకారణమని కొనియాడారు. ఆ తర్వాత ప్రిన్సిపాల్ వినోద్ తో పాటు అధ్యాపక బృందాన్ని అభినందించి కళాశాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల తరపున ప్రిన్సిపాల్ వినోద్ చిన్నారెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మాజీ డిసిసి అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు చరణ్, భాస్కర్, బాబా తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపికకు నోటిఫికేషన్ విడుదల

**- ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన ఇద్దరు, అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన ఇద్దరు సభ్యుల నియామకం**



కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 16 (మనం న్యూస్): కల్వకుర్తి పురపాలక సంఘంలో కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకొనుటకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. తెలంగాణ మున్సిపాలిటీస్ కో-ఆప్షన్ మెంబర్ రూల్స్-2020 ప్రకారం పురపాలక పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం కలిగిన ఇద్దరు సభ్యులను, అలాగే అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన ఇద్దరు సభ్యులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతి విభాగంలో ఒక మహిళా సభ్యురాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం కలిగిన సభ్యుల ఎంపికకు అభ్యర్థులు పురపాలక సంఘం ఓటరు జాబితాలో నమోదైన ఓటరు అయి ఉండాలి. వారి వయస్సు కనీసం 21 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలి. అదేవిధంగా చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్, వార్డు సభ్యులుగా లేదా గ్రామ పంచాయతీలలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులుగా కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి.అలాగే మున్సిపాలిటీలో స్టాండింగ్ కౌన్సిల్గా కనీసం మూడు సంవత్సరాలు పని చేసిన న్యాయవాదులు లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థల్లో గెజిటెడ్ అధికారులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన వారు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు.అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన సభ్యుల ఎంపికకు అభ్యర్థులు మున్సిపల్ ఓటరు జాబితాలో నమోదై ఉండాలి. వారి వయస్సు 21 సంవత్సరాలకు తగ్గకుండా ఉండాలి. అదేవిధంగా వారు అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన వారై ఉండాలని నిబంధనలు పేర్కొన్నాయి.అర్హతలు కలిగిన మరియు ఆసక్తి ఉన్న కల్వకుర్తి పురపాలక సంఘం పరిధిలోని అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు అవసరమైన ధృవపత్రాలను జతచేసి ఏప్రిల్ 17 నుండి ఏప్రిల్ 24 సాయంత్రం 5 గంటలలోపు కమిషనర్, పురపాలక సంఘం, కల్వకుర్తి కార్యాలయానికి సమర్పించాలని కమిషనర్ సూచించారు.

